# సింగరేణిలో ప్లాస్టిక్ వినియోగం నిషేధం




**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

సింగరేణి సంస్థ ప్లాస్టిక్ వినియోగంపై సంపూర్ణ నిషేధం విధిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ సింగరేణి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో సంస్థ సీఎండీ ఎన్.బల రామ్ ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. "ప్రపంచ వ్యాప్తంగా ప్లాస్టిక్ కాలుష్యానికి ముగింపు పలుకుదాం" నినాదాన్ని అనుసరించి సింగరేణి గనులు, కార్యాల యా లు, విభాగాలలో ప్లాస్టిక్ వినియోగంపై నిషేధం అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్లాస్టిక్ బాటిల్స్, ప్లేట్లు వంటి ఉత్పత్తులను పూర్తిగా ఉపయోగించవద్దని స్పష్టం చేశారు. సింగరేణి ప్రాంతాల్లో మొక్కల పెంపకం వల్ల ఉష్ణోగ్రతలు 50 డిగ్రీల నుంచి 40 డిగ్రీలకు తగ్గాయని వెల్లడించారు. ఒడిశా నైనీ బొగ్గు గనుల్లో కూడా మొక్కలు నాటేందుకు సింగరేణి సిద్ధమవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.డీ.ఎం.సుభాని, జనరల్ మేనేజర్ ఎన్.వి.రాజశేఖర్ రావు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. జ్యూట్ బ్యాగులు పంపిణీ చేశారు. పర్యావరణంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందినవారికి బహుమతులు అందించారు.

# లక్ష్యాలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలి

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

జిల్లాలో సంక్షేమశాఖకు కేటాయించిన లక్ష్యాలను సమర్థవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ దీపక్ అధికారులను ఆదేశించారు. గురువారం జరిగిన సమీక్ష సమావేశంలో అంగన్వాడీ కేంద్రాల పనితీరు, మహిళలు, శిశువుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అంగన్వాడీ సూపర్వైజర్లకు కేంద్రాల పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించాలని, గర్భిణులు, పిల్లలకు టీకాలు, పౌష్టికాహారం సకాలంలో అందించాలని ఆదేశించారు. ప్రతి అంగన్వాడీ కేంద్రానికి సంబంధించి సమాచారాన్ని ఫొటోలతో ప్రజంటేషన్ చేయాలని, సమస్యల పరిష్కారంపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. దివ్యాంగుల కోసం రాజీవ్ యువ వికాసం పథకంలో అర్హుల జాబితాను రూపొందించాలని, సఖి కేంద్రాల ద్వారా బాధితులకు కౌన్సిలింగ్ నిర్వహించాలని చెప్పారు. ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు కార్డులు జారీ చేసి, మహిళా శక్తి పథకంపై అవగాహన కల్పించాలని సూచించారు. బాల్య వివాహాలను పూర్తిగా నిరోధించాలని, పాఠశాలలకు సంబంధించి రెస్క్యూ ఆపరేషన్లు కొనసాగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.





## కన్నాపూర్‌లో మడేలేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

శంకరపట్నం మండలంలోని కన్నాపూర్ గ్రామంలో రజకుల కులదైవమైన శ్రీ మడేలేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన బోనాలను రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పూజారులు కలకుంట్ల మధుసూదనాచార్యులు, యజ్ఞాచార్యులు కలకుంట్ల మురళీకృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో ఈ విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది.ఈ కార్యక్రమంలో రజక సంఘం మానకొండూర్ నియోజకవర్గ ఇంచార్జి నాంపెల్లి శంకరయ్య, మండల అధ్యక్షుడు తాడిచెర్ల తిరుపతి, ప్రధాన కార్యదర్శి రాసమల్ల శ్రీనివాస్, కల్లేపెల్లి కిరణ్, గ్రామ రజక సంఘం నాయకులు రాసవేణి సమ్మయ్య, బండి మల్లయ్య, కాల్వ శ్రీనివాస్, నాంపెల్లి వెంకటేష్, బండి కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనేక గ్రామాల రజక సంఘాల ప్రతినిధులు, వివిధ కుల సంఘాల పెద్దలు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.



## ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై ఏసీపీ విచారణ



**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

కరీంపేట గ్రామంలో జరిగిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు విషయమై గురువారం హుజురాబాద్ ఏసీపీ మాధవి విచారణ చేపట్టారు.గత నెల 22న గడ్డం మల్లవ్వ, ఆమె కుమారుడు రాజు ఇంటివద్ద కేకలు వినిపించడంతో మెరుగు శ్రీనివాస్ సహా మరికొందరు అక్కడికి వెళ్లారు. ఆ సమయంలో మల్లవ్వ, రాజు భార్య రేణుకను కొడుతున్న దృశ్యాన్ని గుర్తించారు. ఎందుకు కొడుతున్నారని ప్రశ్నించగా, శ్రీనివాస్ సహా ఇతరులను కులం పేరుతో దూషించినట్లు బాధితులు కేశవపట్నం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.ఫిర్యాదుతో వెంటనే స్పందించిన ఏసీపీ మాధవి, ఎస్సై కొత్తపల్లి రవి సంఘటన స్థలాన్ని పరిశీలించి, సాక్షుల నుండి వివరాలు నమోదు చేశారు.

## పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

**బీజేపీ జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్**



**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

మంచిర్యాల బీజేపీ జిల్లా కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు జూన్ 5 నుంచి ఆగస్టు 15 వరకు మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహించాలని, జూన్ 21న యోగా దినోత్సవాన్ని గ్రామ స్థాయిలో నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో దుర్గం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంట్లో బంగారం దొంగతనం

**మెట్‌పల్లి, జూన్ 5:**

పట్టణంలోని దుబ్బవాడకు చెందిన బెజ్జారపు తార ఇంట్లో బుధవారం రాత్రి దొంగతనం జరిగినట్లు ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి బీరువాలను పగలగొట్టి ఒక తులం బంగారు పుస్తెలు, మూడు గ్రాముల బంగారు పుస్తెల గుండ్లు, సత్యనారాయణ స్వామి విగ్రహాన్ని చోరీ చేశారు.సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధితురాలు తార ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్ఐ తెలిపారు.

# ప్రకృతి మిత్రులుగా మారండి






**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని, మంచిర్యాల ఎం.సి.సి.లోని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా కార్యాలయంలో గురువారం పర్యావరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.ఎన్.అజయ్ మణి కుమార్ ఆధ్వర్యం వహించగా, ముఖ్య అతిథిగా "వాల్టా" అథారిటీ సభ్యుడు గుండేటి యోగేశ్వర్ హాజరయ్యారు. కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటి, వాటి సంరక్షణపై ఉద్యోగుల తో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో యోగేశ్వర్ మాట్లాడుతూ, ప్రతి పౌరుడు పర్యావరణ పరిరక్షణ బాధ్యతగా భావించాలని, పర్యావరణ హితమైన అలవాట్లను అభ్యాసంగా మార్చుకోవాలని సూచించారు. సహజ వనరులను పొదుపుగా వాడాలని, పుట్టినరోజులు వంటి ప్రత్యేక సందర్భాల్లో మొక్కలు నాటి గ్రీన్ గిఫ్ట్ కాన్సెప్ట్‌ను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా మానాలని సూచించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం రూపొం దించిన పర్యావరణ మిత్ర బట్ట సంచులను ఆవిష్కరించి ఉచితంగా పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణలో తన సూచనలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యోగేశ్వరుని ఘనంగా సన్మానిస్తూ, అతని సేవలను అధికారులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఎం.సి.సి.అధ్యక్షుడు పీ.ప్రకాష్ రావు, డి.జీ.ఎం కె.అనీల్ కుమార్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## గ్రామ ప్రభుత్వ ఆస్తులను కాపాడాలి

**తహసీల్దార్‌కు కొర్విచెల్మ గ్రామస్తుల వినతి**

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

దండేపల్లి మండలం కొర్విచెల్మ గ్రామ ప్రజలు తమ గ్రామంలోని ప్రభుత్వ ఆస్తులను రక్షించాలని తహసీ ల్దార్ ను కోరారు. పాత పంచాయతీ భవనం శిథిలావస్థకు చేరిందని, దానిని మరమ్మతులు చేసి చుట్టూ ప్రహరీ నిర్మించాలని వినతి పత్రం అందజేశారు.అలాగే గ్రామానికి చెందిన బంజర భూములు అక్రమంగా ఆక్రమితుల చేతికి చిక్కకుండా గోడలు వేసి రక్షించాలని, ఆ భూముల వివరాలను పంచాయతీ కార్యాలయంలో నమోదు చేయాలని కోరారు. ఇతర ప్రభుత్వ ఆస్తులకూ రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా మాజీ ఉపసర్పంచి ముద్దసాని తిరుపతి, ముద్దసాని భీమయ్య, మల్యాల రమేష్, గోపు మల్లేష్ పాల్గొన్నారు.

## నకిలీ డాక్యుమెంట్లతో షాపు కబ్జా

**ముగ్గురు అరెస్ట్**
**ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి వెల్లడి**

**ఆదిలాబాద్, జూన్ 6:**

నకిలీ ఇంటి నంబర్, లీజు పత్రాలు సృష్టించి షాపును కబ్జా చేసిన ఘటనపై ఆదిలాబాద్ జిల్లా పోలీసు శాఖ కఠినంగా స్పందించింది. ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి తెలిపారు.పట్టణంలోని గణేష్ టాకీస్ పక్కన ఉన్న హౌస్ నంబర్ 6-6-2/1కి చెందిన ఈ బుచ్చమ్మ అనే మహిళకు చెందిన దుకాణాన్ని కబ్జా చేసేందుకు ప్రధాన నిందితుడు సయ్యద్ జహీరుద్దీన్ (A1) కిరాయిదారిగా ఉంటూ నకిలీ లీజు డాక్యుమెంట్ సృష్టించాడు. ఆ ఆధారంగా మున్సిపాలిటీలో నకిలీ డోర్ నంబర్ తీసుకుని, సీనియర్ డాక్యుమెంట్ రైటర్ ఫైజుద్దీన్ సిద్ధికీ అలియాస్ సాహెర్ భాయ్ (A5) సహా యంతో షాపును తన కుమారుడు మహమ్మద్ సోహెబ్ (A2) మరియు ఇతరుల పేరుపై రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు.ఈ మేరకు నిజమైన వారసులకు షాపు అప్పగించకుండా అక్రమంగా కబ్జా చేశారు. మున్సిపాలిటీ విచారణలో డోర్ నంబర్ నకిలీగా తేలడంతో రద్దు చేశారు. బాధితుల ఫిర్యాదుతో ఆదిలాబాద్ ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేయగా, A1 సయ్యద్ జహీరుద్దీన్, A2 మహమ్మద్ సోహెబ్, A5 ఫైజుద్దీన్ సిద్ధికీలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.



పరారీలో ఉన్న A3 ఎస్తేర్ హుస్సేన్, A4 షేక్ అబిద్ షేక్ నూర్‌ల కోసం గాలింపు కొనసాగుతోంది.లింక్ డాక్యుమెంట్లు లేకుండా రిజిస్ట్రేషన్ చేయొద్దని, డాక్యుమెంట్ రైటర్లు, రిజిస్ట్రేషన్ అధికారులు అన్ని పత్రాలు పూర్తిగా పరిశీలించి మాత్రమే రిజిస్ట్రేషన్ చేయాలని డీఎస్పీ సూచించారు. ఇటువంటి నకిలీ పత్రాలతో భూములు, షాపులు కబ్జా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.